రామాయంపేట : పట్టణంలోని నగరేశ్వర దేవాలయంలో జ్యోతిర్లింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

చిలిపిచెడ్ : చండూర్ రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ: ప్రాచీన శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అభిషేక ప్రియ.. భక్త వల్లభ

- శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు
- ఏడుపాయలకు పోటెత్తిన జనం
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- ఉపవాస దీక్షలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు

మహా శివరాత్రి పర్వదినాన జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు ఏడుపాయల వనదుర్గాభవాని, కొప్పోల్ ఉమా సంగమేశ్వర, ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. శివలింగానికి అభిషేకాలు, లక్షబిల్వార్చన, అన్నపూజ, ఆకు పూజ, యజ్ఞాలు, హారతి, సహస్ర నామార్చన, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షను ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. - మెదక్ న్యూస్ నెట్‌వర్క్, మార్చి 8

రామాయంపేట : మార్కండేయ ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

చేగుంట : రాంపూర్ అగ్రహారం శివాలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మెదక్‌రూరల్ : మల్లన క్షేత్రంలోని శివలింగానికి రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

నిజాంపేట : మల్లికార్జున స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

వెల్దుర్తిలో పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పెద్దశంకరంపేట: కొప్పోల్ కోనేరులో స్నానాలాచరిస్తున్న భక్తులు

నర్సాపూర్ శివాలయంలో పూజలు

వెల్దుర్తి : బస్వాపూర్ మల్లన్నక్షేత్రంలో పూజలు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ముందుండాలి
- ఘనంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించిన వివిధ సంఘాలు

నర్సాపూర్: సమావేశంలో మాట్లాడుతున్న విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు

మహిళా కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి

నర్సాపూర్, మార్చి 8 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా, మున్సిపల్ మహిళా సిబ్బందిని సన్మానించారు. మహిళలు ప్రభుత్వ పథకాలతో ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాంచందర్, మేనేజర్ మధుసూదన్, జూనియర్ అసిస్టెంట్ నగేశ్ పాల్గొన్నారు.

బీవీఆర్ఐటీలో..

నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో బాజా సైండియా-2024 పోటీల్లో భాగంగా శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమెన్స్ ఎక్స్‌క్లూజీవ్ మినీ-ఎండ్యూరెన్స్ రేస్ పోటీలు నిర్వహించారు. అనంతరం మహిళా క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కె.వి.విష్ణురాజు మాట్లాడుతూ ఈ రంగంలో మహిళల సంఖ్య పెంచడం, అవకాశాలను పంచుకోవడానికి ఓ వేదికలా ఉపయోగపడుతుందన్నారు. ఈ ఏడాది మహిళలతో పెట్టుబడులు పెట్టించండి పురోగతిని వేగవంతం చేయండి అనే థీమ్స్‌ను ఐక్యరాజ్య సమితి ప్రకటించిందని గుర్తుచేశారు. తమ ఎడ్యుకేషనల్ సొసైటీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల కోసం రెండు మహిళా ఇంజినీరింగ్ కళాశాలలు ప్రారంభించిందన్నారు. విద్యుత్ వాహనాల పోటీలో భాగంగా మూడో రోజు ఆల్ టెర్రైన్ రోడ్ ఎలక్ట్రిక్ బగ్గీస్ ఉమెన్స్, బ్రేక్ పరీక్షలు, సాంకేతిక మూల్యాంకనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే పాల్గొన్నారు.

నర్సాపూర్: మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

మహిళా హక్కులను కాలరాస్తున్న కేంద్రం

రామాయంపేట, మార్చి 8 : కేంద్ర ప్రభుత్వం జీవోలు తెచ్చి మహిళల హక్కులను కాలరాస్తున్నదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం రామాయంపేటలోని మహంకాళి ఆలయంలో మధ్యాహ్న భోజనం, పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ ఆయాలతో సమావేశం ఏర్పాటు చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

కొప్పోల్ ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

పెద్దశంకరంపేట :కొప్పోల్ సంగమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు

సంగమేశ్వర ఆలయంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ తదితరులు

- బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తాం
- 'ఖేడ్' ఎమ్మెల్యే సంజీవరెడ్డి
- ఉమాసంగమేశ్వరుడికి పూజలు

పెద్దశంకరంపేట, మార్చి 8 : కొప్పోల్ ఉమాసంగమేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం ఉమా సంగమేశ్వర ఆలయంలో శివలింగానికి ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొప్పోల్ దేయాలయానికి బీటీ రోడ్డు మంజూరైందని, త్వరలో బీటీ రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. ఖేడ్ నియోజకవర్గంలో 75 శాతం రోడ్డు పనులు పూర్తి చేస్తానన్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన హెల్త్, పోలీస్, రెవెన్యూ క్యాంపులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఆయనతో ఆలయ కమిటీ సభ్యులు పద్మ బాపిరాజు, రాజశేఖర్‌రెడ్డి, శంకరయ్య, పరమేశ్వర్‌రెడ్డి, రాయిని మధు, నాయకులు నారాగౌడ్, సంగమేశ్వర్, ఆర్ఎన్ సంతోష్ ఉన్నారు.

కొప్పోల్‌లో ఎంపీ బీబీ పాటిల్ పూజలు

కొప్పోల్ ఉమా సంగమేశ్వరుడికి జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో రూ. 3 లక్షలతో పైడి ఎల్లారెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయనతో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, నాయకులు కోనం విఠల్, రామకృష్ణ, శ్రావణ్‌కుమార్, సీతారామారావు, సంగమేశ్వర్, సతీశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పెద్దమ్మ ఆలయానికి మైక్‌సెట్ అందజేత

నిజాంపేట మండలంలోని రాంపూర్ పెద్దమ్మ ఆలయానికి అదే గ్రామానికి చెందిన జెల్లా లక్ష్మణ్‌గౌడ్ శుక్రవారం మైక్‌సెట్‌ను బహుకరించారు. - నిజాంపేట, మార్చి 8

సూరారంలో సీసీరోడ్డు పనులు ప్రారంభం

చిన్నశంకరంపేట, మార్చి 8: పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీటీసీ అనురాధ సూచించారు. శుక్రవారం మండలంలోని సూరారంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆమె అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నీరజ పవన్‌గౌడ్, నాగరాజు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో పోలీసుల కవాతు

చిన్నశంకరంపేట, మార్చి 8: చిన్నశంకరంపేటలో కేంద్ర పారామిలిటరీ బలగాలతో పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికలు ఉన్నందున కేంద్ర పారామిలిటరీ బలగాలతో కవాతు నిర్వహించినట్లు ఎస్సై నారాయణ తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం

తల్లీకూతురు శ్యామల, రిషిత

నిజాంపేట, మార్చి 8 : తల్లి, కూతురు అదృశ్యమైన ఘటన నిజాంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నార్లాపూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన వివాహిత గోదూరి శ్యామల ఈ నెల 5న తన భర్త గోదూరి బాలరాజుతో గొడవపడి తన కూతురు రిషితను తీసుకుని అదే రోజు సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా తల్లీకూతుర్ల ఆచూకీ లభించలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భర్త బాలరాజు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చిన్నశంకరంపేట, మార్చి 8: గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 29న కొయ్యమర్రి గిరిజన తండా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయాన్ని తండావాసులు చిన్నశంకరంపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడని ఎస్సై నారాయణ తెలిపారు. మృతదేహం మెదక్ ఏరియా దవాఖానలో ఉందన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మహేశ్వరుడికి ఆభరణాలు అందజేత

ఉమామహేశ్వర స్వామికి వెండి నాగపడుగను అలంకరిస్తున్న తలసాని భాస్కర్‌రెడ్డి దంపతులు

చేగుంట, మార్చి 8: మండలంలోని ఉల్లితిమ్మాయిపల్లి ఉమా మహేశ్వరస్వామి దేవాలయానికి దాతలు రెండు కిలోల వెండి నాగపడిగ, లాకర్‌ను అందజేశారు. చేగుంట పట్టణంలో నివాసం ఉంటున్న తలసాని భాస్కర్‌రెడ్డి దేవాలయంలోని శివలింగానికి రెండు కిలోల వెండి నాగపడుగ,వస్తువులను దాచేందుకు లాకర్‌ను అందజేశారు.ఆదివారం జాతర సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేస్తామని భాస్కర్‌రెడ్డి తెలిపారు.

లొంగిపోయిన చిట్టీల వ్యాపారి

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

తూప్రాన్, మార్చి 8 : అధిక వడ్డీ ఆశ చూపి రూ. కోట్లలో కుచ్చుటోపీ పెట్టిన నిందితుడు శుక్రవారం తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న బాధితులు భారీ ఎత్తున పోలీస్‌స్టేషన్ చేరుకుని తమకకు డబ్బులు ఇప్పించాలంటూ ఆందోళనకు దిగారు. తూప్రాన్ పట్టణానికి చెందిన బిజిలీపురం యాదగిరి చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అంతేకాకుండా తన వద్ద పెట్టుబడి పెడితే నూటికి రూ. 5 నుంచి 20 శాతం వరకు నెలనెలా వడ్డీ చెల్లిస్తానని నమ్మబలికాడు. కొంత మందికి క్రమం తప్పకుండా చెల్లింపు చేయడంతో తూప్రాన్ మండలమే కాకుండా పరిసర మండలాల ప్రజలు సైతం పెట్టుబడులు పెట్టారు. ఇదికాకుండా ఇండ్లపై రుణాలు, ఖరీదైన మొబైల్ ఫోన్లను ఈఎంఐలో ఇప్పించి, లోన్ డబ్బులు, ఫోన్లను కూడా పెట్టుబడిగా జమ చేసుకుని వడ్డీ చెల్లించేవాడు. రెండు, మూడు నెలలుగా వడ్డీలు సక్రమంగా చెల్లించకపోవడంతో బాధితులు యాదగిరిపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఈ నెల 4న నిజామాబాద్ పెద్దగుట్టకు వెళ్తున్నాని భార్యాపిల్లలతో కలిసి పరారయ్యాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో యాదగిరి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆందోళన చెందిన బాధితులు ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311806-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657